# పరస్పర సహకారంతో పనులు సులువు

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

సూర్యాపేట లీగల్, డిసెంబర్ 13 : పరస్పర సహకారం ఉంటేనే పనులు సులభతరం అవుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. ఈ నెల 30న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి బుధవారం కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి బ్యాంక్, బీమా కంపెనీ అధికారులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు జె.శశిధర్, జి.రమాదేవి, టి.శ్రీనివాస్‌రావు, సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.అశోక్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నాయకుడు ఎస్‌కే మీరాను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

## బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 13 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 48వ వార్డు కోటమైసమ్మ బజార్‌లో బీఆర్ఎస్ నాయకుడు ఎస్‌కే మీరా అనారోగ్యంతో ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నాడు. బుధవారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బొమ్మిడి అశోక్, చనగాని అంజమ్మ, దొండ శ్రీను, యూసుఫ్ పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు పూర్తి చేయాలి

● ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు



పిన్నాయిపాలెంలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు

సూర్యాపేట రూరల్, డిసెంబర్ 13 : గ్రామాల్లో ఇంకా పూర్తికాని పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు అధికారులను ఆదేశించారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా నర్సరీల్లో నాణ్యమైన మొక్కలు పెంచాలన్నారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన ఏడు రకాల రిజిస్టర్లలో రిపోర్టులు అందించాలన్నారు. గ్రామాల్లో ఎల్లప్పుడు పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా పారిశుధ్యం మెరుగుపరుచాలని సూచించారు. అలాగే మండలంలోని పిన్నాయిపాలెం, సఫవత్ తండా గ్రామ పంచాయతీల్లోని నర్సరీలను పరిశీలించి నాణ్యమైన విత్తనాలు నాటాలని, విత్తనాలు నాటిన పది రోజుల్లో మొక్కలు వచ్చే విధంగా చూడాలని పేర్కొన్నారు. ఎంపీఓ పరాంకుశరావు, ఏపీఓ వెంకన్న పాల్గొన్నారు.

# ఢిల్లీ జంతర్‌మంతర్ ధర్నాను విజయవంతం చేయాలి

● టీఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి ఉపేందర్‌మాదిగ



హలో మాదిగ చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 13 : ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని టీఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి కత్తి ఉపేందర్‌మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఖమ్మం క్రాస్‌రోడ్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద హలో మాదిగ చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ ఈ నెల 20న టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించడం జరుగుతుందని, అంతా విచ్చేసి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పాతకొట్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్దాస్ శంకర్, నాయకులు బాషపంగు సత్యం, గూడపురి ఉపేందర్, కత్తి గురువయ్య, రాజు పాల్గొన్నారు.

# సీఎంఆర్ లక్ష్యం చేరుకునేనా ?

- మిగిలింది 16 రోజులు.. రావాల్సింది 75 వేల మెట్రిక్ టన్నులు
- సూర్యాపేట జిల్లాలో కొన్ని మిల్లుల మాయాజాలం
- కోట్లాది రూపాయల విలువ చేసే ధాన్యం గోల్‌మాల్
- ధాన్యం అమ్మి పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ చేసి పెడుతున్నట్లు అనుమానాలు



సూర్యాపేట, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రంలో సీఎంఆర్ అంటే చాలు అటు మిల్లర్లకు, ఇటు అధికారులకు పంట పండేది. ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యాన్ని మిల్లింగ్ కోసం తీసుకుని ఎగనామం పెట్టడం అనవాయితీగా ఉండే. చాలాచోట్ల మిల్లర్లపై కేసులు నమోదు చేయడం, రికవరీకి చర్యలు తీసుకోవడం కొనసాగేది. గతంలో ఎగనామం పెట్టిన మిల్లుల నుంచి ఇప్పటికీ జిల్లాలో దాదాపు కోట్లాది రూపాయలు రావాల్సి ఉన్నది. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ఆస్తులు జప్తు చేయాల్సి ఉన్నప్పటికీ అది కూడా తూతూ మంత్రంగానే కొనసాగుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు ఇస్తూ ఐకేపీ, పీఏసీఎస్ లాంటి ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేయిస్తున్నది. వాటిని మిల్లింగ్ చేసేందుకు జిల్లాలోని ప్రైవేట్ మిల్లులకు అందజేస్తున్నది. అయితే గడువులోపు ఆయా మిల్లర్లు ధాన్యాన్ని మిల్లింగ్ చేసి నిబంధనల మేరకు బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అందజేయాల్సి ఉన్నది.

## ఈసారి లక్ష్యం చేరుకోవడం కష్టమే..

2022-23 యాసంగిలో జిల్లా వ్యాప్తంగా రైతుల నుంచి 2,57,849 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ ధాన్యాన్ని జిల్లాలోని 59 ఫార్‌బాయిల్డ్, బిన్ని మిల్లులకు మిల్లింగ్ చేసేందుకు ఆయా మిల్లుల సామర్థ్యాన్ని అనుసరించి కేటాయించింది. ఈ ధాన్యాన్ని మిల్లింగ్ చేసిన అనంతరం రా రైస్ అయితే 67 శాతం, బాయిల్డ్ రైస్ అయితే 68 శాతం చొప్పున బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అందించాల్సి ఉన్నది. అయితే ఈ ఏడాది సీఎంఆర్ లక్ష్యం చేరుకోవడం కష్టతరమేనని తెలుస్తున్నది. జిల్లాలో సివిల్ సప్లై శాఖ ఆధ్వర్యంలో 2,57,849 మెట్రిక్ టన్నుల రా రైస్, బాయిల్డ్ రకం ధాన్యాన్ని ప్రొక్యూర్ చేసి మిల్లులకు పంపించింది. ఈ ధాన్యాన్ని మిల్లింగ్ చేసిన అనంతరం పర్సంటేజీ ప్రకారం ప్రభుత్వానికి 2,09,933 మెట్రిక్ టన్నుల బియ్యం సివిల్ సప్లై శాఖ సేకరించాల్సి ఉన్నది. అయితే సేకరణకు ఇంకా 16 రోజుల వ్యవధి మాత్రమే ఉండగా 75 వేల మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉన్నదని అధికారుల ద్వారా తెలిసింది.

## పలు మిల్లుల్లో ధాన్యం మాయం?

జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ కోసం తీసుకున్న ధాన్యాన్ని పలు మిల్లుల యాజమాన్యం తెగనమ్ముకున్నట్లు తెలుస్తున్నది. జిల్లాలో 2,57,849 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వగా ఇప్పటి వరకు 10 నుంచి 20 శాతం సీఎంఆర్ మాత్రమే అందించిన మిల్లులు 10కి పైనే ఉండగా 50 నుంచి 60 శాతానికి పైనే సీఎంఆర్ పూర్తి చేసిన మిల్లులు 11 ఉన్నాయి. అలాగే వంద శాతం పూర్తి చేసిన మిల్లులు జిల్లాలో 32 ఉన్నాయి. 2022-23 యాసంగికి సంబంధించిన సీఎంఆర్ పరిస్థితే ఇలా ఉంటే అంతకు మునుపు కూడా జిల్లాలో సుమారు 25కు పైనే మిల్లుల నుంచి వందల కోట్ల రూపాయల సీఎంఆర్ పెండింగ్ ఉన్నట్లు సమాచారం. గత యాసంగికి సంబంధించి మిల్లుల నుంచి బియ్యం తక్కువ ఇచ్చినప్పటికీ జిల్లాలో ఉన్న సివిల్ సప్లై అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## పీడీఎస్ బియ్యంతోనే..

ప్రతి ఏడూ మిల్లులకు ఇచ్చిన ధాన్యాన్ని తెగనమ్ముకుని ప్రభుత్వం పేదల కోసం సరఫరా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద వాటినే పెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేదల కోసం ప్రభుత్వం బియ్యం పంపిణీ చేస్తుండగా కొంతమంది దళారులు ఆ బియ్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇలా తక్కువ ధరకు సేకరించిన బియ్యాన్నే రీ సైక్లింగ్ చేసి సీఎంఆర్‌గా పెడుతున్నారు. సీజన్‌లో వచ్చే ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకుని సీఎంఆర్ గడువు ముగిసే సమయంలో పీడీఎస్ బియ్యాన్ని సేకరించి అధికారులను మేనేజ్ చేస్తూ లక్ష్యం పూర్తి చేసినట్లుగా చూపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# విద్యార్థులకు డ్రాయింగ్ పుస్తకాలు అందజేత



విద్యార్థులకు డ్రాయింగ్ బుక్స్ అందజేస్తున్న హెచ్‌ఎం గిరిగౌడ్

పెన్‌పహాడ్, డిసెంబర్ 13 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గిరి హోమ్ అప్లయెన్స్ సంస్థ యజమానురాలు మాధవీలత తన సొంత ఖర్చులతో ప్రముఖ ఆర్టిస్ట్ ఆనంద్ ముద్రించిన డ్రాయింగ్ పుస్తకాలను మండలంలోని ధర్మాపురం ప్రాథమిక పాఠశాలకు అందజేశారు. బుధవారం హెచ్‌ఎం పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్

బొడ్రాయిబజార్, డిసెంబర్ 13 : ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పల్లేటి లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈ మేరకు లక్ష్మణ్‌కు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన కార్యవర్గానికి, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

## పట్టణ మహిళా అధ్యక్షురాలిగా సునీత

ఎమ్మార్పీఎస్ టీఎస్ సూర్యాపేట పట్టణ మహిళా అధ్యక్షురాలిగా పిడమర్తి సునీత నియమితులయ్యారు. ఈ మేరకు నియోజక వర్గ ఇన్‌చార్జి పొలడుగు పరశురాములు బుధవారం ఆమెకు నియామక పత్రం అందజేశారు.

## ఆర్థిక సాయం

తుంగతుర్తి, డిసెంబర్ 13 : మండలంలోని దేవునిగుట్టతండాకు చెందిన గుగులోతు వెంకన్న అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విద్యాభారతి హై స్కూల్ తుంగతుర్తి ఉపాధ్యాయులు అలాగే తనతో పాటు చదువుకున్న పదో తరగతి స్నేహితులు బుధవారం వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.50 వేలు అందజేశారు. కార్యక్రమంలో నసీరుద్దీన్, తాళ్లపల్లి సోమన్న, మల్లయ్య, వగలాని మల్లేష్, గుండగాని సుధాకర్, గుగులోతు ఈరోజి, వెలుగు సైదులు, ఆంబోతు ఈరులు పాల్గొన్నారు.




దేవాదాయ - ధర్మాదాయ శాఖ

**శ్రీ యల్లమ్మ అమ్మవారి దేవస్థానము**

గ్రా॥ దర్వేశిపురం (పర్వతగిరి), మం॥కనగల్, జి॥నల్లగొండ.

**టెండర్ కం-బహిరంగ వేలము ప్రకటన** తేది:11.12.2023

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా పై దేవస్థానము వద్ద తేది:19-12-2023 మంగళవారం రోజున మ॥గం.1-00లకు నుండి ఈ క్రింద పేర్కొనబడిన వేలములు 2023-2024 సం॥నకు దేవాదాయ ప్రాంగణంలో వేలము నిర్వహించబడును. ఆసక్తిగల వారు పాటలో పాల్గొనవలసిందిగా కోరడమైనది.

ఇట్టి వేలమునకు సంబంధించిన షరతులు కార్యాలయములో తెలుసుకొనగలరు. లేదా వేలమునకు ముందు చదివి వినిపించబడును. ఆసక్తి గల వారు తేది:19-12-2023, మంగళవారం రోజున మ॥గం. 1-00లోపు సదరు దేవస్థానము వద్ద ఏర్పాటు చేసిన టెండరు బాక్స్‌లో షీల్డు టెండర్‌లతోపాటు డి.డి. జతపరిచి వేయవలయును. మొదట బహిరంగ వేలం నిర్వహించబడును. తదనంతరం సీల్డు టెండరు తెరవబడును. సరియైన ధర రానిచో టెండరు రద్దు పరిచి మరల టెండరు నిర్ణయించబడును.

| క్ర. సం | వేలము వివరములు | కాల పరిమితి 1 సం॥ | డిపాజిట్ డబ్బు | టెండర్ షెడ్యూల్ ధర | రిమార్క్స్ |
|---|---|---|---|---|---|
| 1 | కొబ్బరికాయలు అమ్ముకొను హక్కు | తేది:20-12-2023 నుండి తేది:19-12-2024 వరకు | 10,00,000-00 | 2000-00 | ఏదేని జాతీయ బ్యాంకులో APGVB నల్లగొండ, రామగిరి బ్రాంచు నందు చెల్లుబాటు అవునట్లు డి.డి తీయవలెను. |
| 2 | చీరలు, వడిబియ్యం | తేది:20-12-2023 నుండి తేది:19-12-2024 వరకు | 50,000-00 | 1000-00 | |
| 3 | పూలు, పండ్లు అమ్ముకొను హక్కు | తేది:01-01-2024 నుండి తేది:31-12-2024 వరకు | 2,00,000-00 | 1000-00 | |

నోటు: డిపాజిట్ డి.డిలు మాత్రమే స్వీకరించబడును. డి.డిలు E.O. Sri Yellamma Temple, Dharveshipuram పేరుమీద తీయవలెను.

అల్లుబెల్లి నర్సింహ్మారెడ్డి
చైర్మన్ మరియు ధర్మకర్తల మడలి
సెల్:9963729532

జిల్లేపల్లి జయరామయ్య
కార్యనిర్వహణాధికారి
సెల్: 9951999438, 9182701028

వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 9000010884, 8008088307